క్లుప్తంగా

'క్షయ'ను గుర్తించాలి

చర్లరూరల్: 14 సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు వచ్చే క్షయ వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలని సాతి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ వై.ప్రభాకర్ తెలిపారు. శనివారం సత్యనారాయణపురం, కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి ఉన్న వారి కుటుంబాలలో చిన్న పిల్లలకు ఎవరైనా ఉన్నట్లయితే వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సత్యనారాయణపురం వైద్యాధికారిని దివ్యనయన ఐసీడీఎస్ పీఓ చైతన్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణాలో పలువురు మహనీయుల జయంతి ఉత్సవ కరపత్రాన్ని ఉత్సవ కమిటీ శనివారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రామ్ ఏప్రిల్ 11న, మహాత్మ జ్యోతిరావు పూలే ఏప్రిల్ 11న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏప్రిల్ 14న జన్మించిన సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కొమ్మగిరి వెంకటేశ్వర్లు, ఇసంపల్లి ముత్యం, వెంకటేశ్వర్లు, వెంకట నర్సమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న వలస ఆదివాసీ గ్రామం మానుగట్టులో ఎంపీడీఓ ఈదయ్య ఆధ్వర్యంలో అధికారులు శనివారం పర్యటించారు. వేసవికాలం ఎండ తీవ్రత దృష్ట్యా మారుమూల మానుగట్టు గ్రామంలో నీటి ఎద్దడి సమస్యను తెలుసుకోడానికి అధికారులు సందర్శించారు. గ్రామంలోని ప్రజలు నీటి సదుపాయం బాగానే ఉందని, ఇబ్బందులు లేవని మరో బోర్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి మరో బోర్ వేయడానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ ముత్యాలరావు,మిషన్ భగీరథ ఇన్ ట్రా డీఈఈ శ్రీనివాస్ రావు, గ్రామ సెక్రెటరీ సర్వేశ్వరావు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'పై అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఈదయ్య అధ్యక్షతన శనివారం అవగాహన కల్పించారు. కూలీలకు రోజుకు రూ.300 రావాలంటే ఎంత పని చేయాలి అనే దానిపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈ అవగహన సదస్సుకు 37 పంచాయతీలకు చెందిన మేట్లులు పాల్గొన్నారు. ఎంపీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, ఈసీ సందీప్, హరినాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంత వేలంపాట ఖరారు

గుండాల: మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంత వేలం పాటలో రూ.లక్షా రెండు వేలకు దక్కించుకున్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో సంత వేలం పాట నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన సనప సుగుణారావు రూ.లక్షా రెండు వేలకు దక్కించుకున్నారు. కార్యదర్శి రాం మోహన్ సింగ్, పీసీ కోశాధికారి పెంటన్న, గోవింద నర్సింహరావు, మాజీ సర్పంచ్ సీతారాములు, నాగరాజు, అనీల్ పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి

మణుగూరురూరల్: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు ప్రభుత్వాలను శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు సరిపడా వేతనాలు ఇవ్వకపోగా.. పని ప్రదేశాల్లో తాగునీటి, వైద్య సదుపాయాలు, పనిముట్లు వంటివి కల్పించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకుందాం

గుండాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబాద్ పార్లమెంట్ నుంచి ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకుని ఆదివాసీ ఐక్యత చాటుకోవాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలైన టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బంజారా సామాజిక వర్గానికి పార్లమెంట్ టికెట్ ఇచ్చి ఆదివాసీలకు ద్రోహం చేశారని ఆరోపించారు. మహబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదివాసీల ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉమ్మడి ఆదివాసీ అభ్యర్థిని పోటీ చేయించి, గెలిపించుకునే బాధ్యత యావత్ ఆదివాసీలపై ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు గుంపిడి వెంకటేశ్వర్లు, పూనెం బాలకృష్ణ, వట్టం కన్నయ్య, వర్స శ్రీనివాస్, తంగెళ్ల భద్రయ్య, వజ్జ ఎర్రయ్య, గోవింద నర్సింహరావు, చింత వెంకటేశ్వర్లు, దుగ్గిరాల వీరభద్రం, ఇమ్మిడి నాగేశ్వరావు, పాల్వంచ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మట్టి'కుండ'.. 'చల్ల'గుండ

- దాహార్తిని తీర్చడంలో ఫ్రిజ్‌కు పోటీ
- ఆరోగ్య సంరక్షణలో ముందంజ
- వేసవిలో పెరిగిన గిరాకీ





మార్కెట్‌లో విక్రయిస్తున్న కుండలు



బూర్గంపాడు: కాలానుగుణం పురాతన వస్తువులు కనుమరుగవుతున్నాయి. అయితే మట్టికుండ మాత్రం తరాలు మారిన తన అవసరాన్ని ప్రజలకు తెలియజేస్తు ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఎండాకాలం వచ్చిందంటే అందరికి మట్టికుండలు గుర్తుకు వస్తాయి. కొత్త కొత్త ఫీచర్లతో ఎన్ని ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లు వచ్చిన మట్టికుండ ముందు దిగదుడుపుగానే నిలుస్తున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చటంలో మట్టికుండలు మొదటిస్థానంలో నిలుస్తున్నాయి. మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చటంతో పాటుగా కుండలో నీళ్ల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి. ఫ్రిజ్‌లలో నీళ్ల తాగితే దాహార్తి తీరకపోగా గొంతునొప్పి, జలుబు, దగ్గు వంటి వ్యాధులు వ్యాపిన్నాయి. పేదవాడి ఫ్రిజ్‌గా పేరు గాంచిన మట్టి కుండ ఇప్పుడు అందరికీ అవసరంగా మారింది.

తయారీ ఇలా..

మట్టికుండల తయారీ కూడా పెద్ద శ్రమతో కూడిన వ్యవహారం. కుమ్మరులు చెరువు మట్టిని తీసుకువచ్చి, కుప్పగా పోసి అందులో నీరుపోసి నానాబెట్టాలి. ఆ తరువాత ఆ మట్టిని బాగా తొక్కి ఆ తరువాత చక్రంపై కుండగా చేయాలి. ఆ కుండలను ఎండబెట్టి, ఆ తరువాత కుప్పగా పేర్చి గడ్డితో కాల్చాలి. ఆ తరువాతనే కుండలను అమ్మకాలకు తీసుకెళ్లాలి. గత తరం వారికి మాత్రమే కుండల తయారీలో నైపుణ్యాలున్నాయి. ఈ తరం వారు కుండల తయారీ, అమ్మకాలపై ఏమాత్రం ఆసక్తి కనబరచటం లేదు.

సైజు ఆధారంగా ధరలు

కుండను తయారు చేయటంతో పాటుగా అమ్మకాలు జరిగేంతవరకు చాలా జాగ్రత్తగా నైపుణ్యతతో వ్యవహరించాలి. ప్రస్తుతం కుండల తయారీ చాలా ఖర్చుతో కూడుకుంది. ప్రస్తుతం కుండల ధర సైజును బట్టి పెరుగుతుంది. 15 లీటర్ల నీరు పట్టే కుండ రూ.200లు, 20 లీటర్ల కుండ రూ.250లు, 25 లీటర్ల కుండ రూ.300లు పలుకుతుంది. కుండలకు ట్యాప్‌లు బిగించి ప్రస్తుతం విక్రయాలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లోనే ప్రస్తుతం కుండలు తయారవుతున్నాయి. ఆ కుండలను మార్కెట్‌లలో, వారపు సంతలలోకి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇళ్లలో ఫ్రిజ్‌లు ఉన్నవాళ్లు కూడా తప్పనిసరిగా కుండలను కొనుగోలు చేస్తున్నారు. కరోనా కష్టకాలం తరువాత ఫ్రిజ్‌లలోని కూల్ వాటర్ తాగేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. ఎండల తీవ్రతకు దాహార్తి పెరుగుతుండటంతో ప్రజలకు మట్టికుండలే ప్రత్యామ్నాయం అయ్యాయి.

ఆకట్టుకుంటున్న ఆకృతులు..

జిల్లాలో పలు మార్కెట్‌లు, సంతల్లో రకరకాల ఆకారాల్లో తయారైన కుండల విక్రయాలు జరుగుతున్నాయి. కుజా ఆకారంలో, గుండ్రని ఆకారంలో, బిందెల ఆకారంలో కుండలు, రంజన్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. జిల్లాతో పాటుగా పొరుగున్న ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి మట్టి కుండల విక్రయాలకు వస్తున్నాయి. రకరకాల ఆకృతులలో, రంగులలో కుండలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. మట్టికుండలతో పాటుగా మట్టితో తయారుచేసిన చిన్నచిన్న పాత్రలకు కూడా మంచి డిమాండ్ ఉంది. పెరుగు తోడుపెట్టుకునేందుకు, మజ్జిగ నిల్వ చేసుకునేందుకు కూడా కొందరు చిన్న మట్టికుండలను కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా వంటలు చేసుకునేందుకు కూడా కొందరు మట్టి పాత్రలపై మక్కువపై చూపుతున్నారు.

ఏటా కుండలు కొంటాం..



ఎండాకాలం తప్పనిసరిగా కుండలు కొనుగోలు చేస్తాం. కుండల రేట్లు పెరిగినా దాహార్తిని తీర్చుకునేందుకు కుండలను తప్పకుండా కొనుగోలు చేస్తాం. ఫ్రిజ్ నీళ్లతో పోలిస్తే కుండలోని నీళ్లు తాగితేనే దాహం తీరుతుంది. ఆరోగ్యం కూడా బాగుంటుంది.

– బర్ల తిరుపతయ్య, బూర్గంపాడు

కుండ నీళ్లే శ్రేష్టం



వేసవిలో మట్టికుండ నీళ్లే శ్రేష్టమైనవి. ఫ్రిజ్‌లలో నీళ్లు తాగితే గొంతు సంబంధిత రుగ్మతలు తలెత్తే అవకాశాలున్నాయి. బాగా కూల్‌గా ఉన్న నీళ్లు తాగితే దాహం కూడా తీరదు. కుండలో నీళ్లు ఓ మోస్తరుగా చల్లగా ఉండటంతో దాహం తీరుతుంది. పైగా ఈ నీళ్లు ఆరోగ్యకరం.

– డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, బూర్గంపాడు

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



చంద్రుగొండ: చివరి పరీక్ష అనంతరం ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



అశ్వాపురం: జెడ్పీ స్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

చంద్రుగొండ: మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా శనివారం ముగిశాయి. ఈ నెల 18వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సెయింట్‌జోసఫ్ పాఠశాలల్లో రెండు కేంద్రాల్లో మొత్తం 286 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పది పరీక్షల ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అశ్వాపురం: మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో అశ్వాపురం, మల్లెలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పని వేళలు మార్చాలి

మణుగూరురూరల్: అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ యాజమాన్యాన్ని కోరారు. శనివారం పివికాలనీ, మల్లారం, రామాలయం అడ్డాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ ఎండ తీవ్రత ఎక్కువవుతుండడంతో కార్మికులు పని చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండల దృష్ట్యా పని వేళలను ప్రతీ ఏడాదిలాగానే ఈ సారి ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం వరకు మార్చేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు, ఓబీ వర్కర్లకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ చేయాలని, దుమ్ము,ధూళి నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశాల్లో కారం భీమయ్య, మంగయ్య, రంగయ్య, నాగరాజు, ఉప్పయ్య, శ్రీరాములు, శ్రీను, రాంబాబు, లక్ష్మి, కృష్ణమ్మ, మునెమ్మ, సుశీల పాల్గొన్నారు.

సఖి సేవలు విస్తరింపజేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాల వరకు సఖి న్యాయ సేవలను విస్తరింపజేయాలని భద్రాచలం జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి అన్నారు. స్థానిక జ్యుడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులోని తన చాంబర్‌లో శనివారం సఖి సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సఖి-వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు అందించే న్యాయ సలహాలు, సేవలను ప్రజలకు వివరించాలన్నారు. 181 మహిళా హెల్ప్ లైన్‌కు ఫోన్ చేస్తే సత్వరమే అందించే సలహాలు, కౌన్సెలింగ్, రక్షణ చర్యలకుపై ప్రజలకు అర్థమయ్యే చెప్పాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ అడ్మిన్ శుభశ్రీ, లీగల్ కౌన్సిలర్ సునీత, కేస్ వర్కర్ శారద పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో బాధితులకు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరైన నగదు ఎల్‌ఓసీ పత్రాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం అందజేశారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సీసం రాంబాబు, వెంకటరమణ దంపతుల కూమర్తె తీవ్ర అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రి, హైదారాబాద్‌లో చికిత్స పొందుతోంది. ఆ దంపతుల వద్ద కూమర్తె వైద్యానికి డబ్బులు లేవని, ఎమ్మెల్యేకు విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే చికిత్స నిమిత్తం రూ.2,20,000ల ఎల్‌ఓసీను మంజూరు చేయించారు. బాధితులకు శనివారం ఆస్పత్రిలోనే అందజేశారు. మరోవైపు, నియోజకవర్గానికి చెందిన పలువురు నిమ్స్ ఆసుపత్రిలో పలు రకాల అనారోగ్యాలతో చికిత్స పొందుతుండగా వారిని కలసి మనోధైర్యం కల్పించారు.

వివాహానికి ప్రముఖుల హాజరు

అశ్వాపురం: చంద్రుగొండ ఎంపీపీ బాణోత్ పార్వతి, రాముడు దంపతుల కుమార్తె అమూల్య వివాహ వేడుకకు శనివారం చంద్రుగొండలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని వాసు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీసర్‌కు వినతి

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఉన్న పలు దుకాణాల్లో, పెట్రోల్ బంకుల్లో, హాస్పిటళ్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మణుగూరు లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులు కష్టంతోనే పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు ఉత్పత్తులను విక్రయిస్తూ అధిక లాభాలను ఆర్జిస్తుంటారన్నారు. లాభాల వచ్చేలా కృషి చేస్తున్న ఆయా విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల శ్రమకు తగ్గ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

ఎస్‌ఓటూ జీఎంకు సన్మానం



ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌ను ఆయన చాంబర్‌లో ఐఎన్టీయూసీ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పలు విభాగాల్లో మణుగూరు ఏరియాలో పనిచేసి గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి మళ్లీ మణుగూరుకు కొత్తగూడెం కార్పొరేట్ నుంచి బదిలీ అయ్యి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఉత్పత్తి ఉత్పాదకలతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారంలో తమ వంతు సాయం అందిస్తామని ఐఎన్‌టీయూసీ నాయకులు ఈ సందర్భంగా వివరించారు. అనంతరం ఏరియాలో ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గట్టయ్య, షాబుద్దీన్, రాములు, జయరాజు, బుర్రా వెంకటేశ్వర్లు, మస్తాన్, నాయుడు, ఎం.శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

చర్ల: గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పూజారిగూడెం, లెనిన్‌కాలనీ, సింగసముద్రం గ్రామాల్లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో ఉన్న జీటీఎస్ఎస్ఎస్ డేకేర్ సెంటర్లలోని 115 మంది నిరుపేద విద్యార్థులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు.చెల్డ్‌కేర్ సెంటర్ పూజారి రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల కోసమే నిర్ణయం



మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ములకలపల్లి: ములకలపల్లి చిరువ్యాపారులు, స్థానికుల విజ్ఞప్తి మేరకే 45 అడుగుల్లోనే రోడ్డు విస్తరణ చేపట్టేందుకు మద్దతు ప్రకటించామని అఖిలపక్ష నాయకులు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు, తేళ్ల చెన్నయ్య, అనుమల శ్రీనివాస్, తాటికొండ ప్రవీణ్, సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్ మాట్లాడారు. సెంట్రల్ లైటింగ్ పనుల నేపథ్యంలో 45 అడుగుల్లోనే విస్తరణ చేయాలని చిరువ్యాపారులు అభ్యర్థిస్తూ, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు లిఖితపూర్వక విన్నపం అందజేశారని అన్నారు. అత్యధికమంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరచడంతో తామంతా సంఘీభావం ప్రకటించినట్లు తెలిపారు. ఐతే కొందరు దురుద్దేశంలో 50 అడుగులమేర నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారుల ఇబ్బందిపెట్టే ఇటువంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు. పలువురు వ్యాపారులు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పేరిట గత నెలరోజులుగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. రాజకీయ, వ్యక్తిగత కక్షలతో తమ పొట్ట కొట్టొద్దని కోరారు. పార్టీలకు అతీతంగా తమకు సహకరించాలని అభ్యర్థించారు. మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి, నాయకులు గాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోపి, శ్రీరాముల నాగేశ్వరరావు, జహీర్, ఓబులశెట్టి ప్రభాకర్, అత్యం సాయి, ఉమేశ్, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతుడు ఈ మా'స్టార్'

- విభిన్న సబ్జెక్టుల బోధనలో దిట్ట
- సమాజ సేవకు, సాహిత్యానికి పురస్కారాలు
- జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైనం



అవార్డులతో కోటేశ్వరరావు



కోటేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న హ్యూమన్ టచ్ జాతీయ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

మణుగూరుటౌన్: ఆయనో నిత్య విద్యార్థి. లెక్కల మాస్టారుగా దీర్ఘచతురస్త్రాకార చుట్టు కొలతను లెక్కించగలరు. ఇంగ్లీషులో విద్యార్థులకు డైరెక్ట్ స్పీచ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌తో పాటు తెలుగు, హిందీ వ్యాకరణములను విశ్లేషణను అర్థమయ్యేలా బోర్డుపై వివరించగలరు. అంతేనా అణువుల రసాయనాల ప్రక్రియను, జీవశాస్త్రంలోని మొక్కలు జంతువుల వర్గీకరణను, దేశ పటంలో రాష్ట్రాల సూచీలను అరటిపండు వలిచినంత సులభంగా బోధించగలరు. ఆల్‌జీబ్రా అంటే గుండె గాబ్రా అనుకునే విద్యార్థులకు ఆయనొక శ్రీనివాస రామానుజన్. బోర్డుపై పాఠం అలా చెప్పారంటే చదువులో ఎంతో వెనుకబడిన విద్యార్థి అయినా కన్ను విప్పార్చకుండా వింటూ అనుమానాలు నివృత్తి చేసుకోవాల్సిందే. ఎన్ని సార్లు చదివినా అర్థం కాని పాఠం అలా బుర్రకెక్కాల్సిందే. ఉపాధ్యాయ వృత్తిలో మూడున్నర దశాబ్దాలుగా ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఆయన ఇవేవి అర్థం కాని విద్యార్థుల ప్రవర్తనను ఒక మనస్తత్వ శాస్త్రం చదివిన వ్యక్తిగా పసిగట్టగల నేర్పరి. ఆయనే మణుగూరుకు చెందిన లెక్కల మాస్టారు ఉయ్యూరు కోటేశ్వరరావు.

కోటేశ్వరరావు మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడిగా ప్రారంభమై.. పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ శ్రోతగా రాణిస్తున్నారు. సేవకుడిగా జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ కార్యనిర్వాహకుడిగా, ప్రపంచ తెలుగు మహాసభల్లో ఉత్తమ సాహితీవేత్తగా తన ప్రతిభను చాటుకున్నారు. పలు బాధ్యత కలిగిన విధులు నిర్వర్తించి గుర్తింపు పొంది ప్రస్తుతం మణుగూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ తెలుగు లిటరేచర్, ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ పూర్తి చేసిన ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. 1969 మార్చి 1న జన్మించిన ఆయన ఎన్నో అవార్డులు ఎన్నో సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.

అవార్డులు.. రివార్డులు

- కోవిడ్–19 విస్తరిస్తున్న సమయంలో ఆయన అనేక వైద్యశిబిరాల నిర్వహణతో పాటు పేదలకు నిత్యావసరాల పంపిణీలో ప్రముఖ పాత్ర పోషించారు. అందుకు గాను కోవిడ్–19 వారియర్‌గా సావిత్రి బాయి పూలే స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్ వారి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. గతేడాది నవంబర్ హ్యూమన్ టచ్ ఫౌండేషన్ ద్వారా జాతీయ అవార్డుకు ఎంపికై ఢిల్లీలో దానిని ఆయన అందుకున్నారు.
- అదే కాలంలో 40కి పైగా అంతర్జాల పరీక్షల్లో పాల్గొని పలువురి నుంచి ప్రశంసలు పొందడంతో పాటు ఉపాధ్యాయులకు ఉపయోగపడే బహుళ ప్రయోజనకర వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి ప్రశంసలు పొందారు.
- ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభమైన తొలినాళ్లలోనే రామోజీరావు చేతులమీదుగా పాఠశాల విద్యపై ఉత్తమ ఉపాధ్యాయుడిగా బంగారు పతకం పొందారు.
- 2003లో గోదావరి పుష్కరాల్లో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా నాటి కలెక్టర్ అరవింద్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు పొందారు.
- ఎన్నికల విభాగం నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లోనూ రిసోర్స్ పర్సన్స్‌గా వీవీ ప్యాట్‌లపై రాష్ట్రస్థాయి ట్రైనీగా పనిచేసి విశిష్ట సేవలందించి ఉన్నత స్థాయి అధికారుల నుంచి అభినందనలతో కూడిన అవార్డులు పొందారు.
- శ్రీనాథుడు చరిత్రను విభిన్న కోణంలో రాసినందుకుగాను ప్రపంచ తెలుగు మహాసభల్లో ఉత్తమ సాహితీ వేత్తగా గుర్తించారు. సకల జనుల సమ్మెలో పీఆర్‌టీయూ తరుపున ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. గుర్తించిన ఉపాధ్యాయ ప్రపంచం ఆయనను తెలంగాణ ఆణి ముత్యంగా సత్కరించింది.
- అనేక సంకలనాలు రాసి జాతీయ స్థాయిలో ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.
- పుడమిసాహిత్య వేదిక నుంచి తెలుగుతేజం విశిష్ట పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. వీటితోపాటు ఇతిహాసప్రజ్ఞ, బహుముఖ ప్రజ్ఞాశాలి, కోవిడ్ వారియర్, విద్యారత్న వంటి ఎన్నో బిరుదులతో పలు సంస్థలు సత్కరించాయి. ఇలా విభిన్న కోణాల్లో ప్రతిభను చాటిన సారు నిజంగా స్టారేనని స్థానికంగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



నవ సమాజ నిర్మాణానికి విద్యార్థులే కీలకం. అలాంటి విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించినప్పుడే మెరుగైన సమాజ నిర్మాణాన్ని నిర్మించగలుగుతాం. మూడు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశాను. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దాలి. ఆ లక్ష్యంతోనే ముందుకు వెళ్తున్నాను.

– కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు